

పెగడపల్లి: ఓటు అభ్యర్థిస్తున్న పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల

# మళ్లీ మోసపోవద్దు

- కాంగ్రెస్‌ను నమ్మితే నిండా మునుగుడే
- ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి గద్దెనెక్కింది
- బీఆర్ఎస్ హయాంలోనే సబ్బండవర్గాల సంక్షేమం
- పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

పెగడపల్లి, ఏప్రిల్ 13: 'కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చింది. నాలుగు నెలల పాలనలో అరకొర పథకాలు అమలు చేసి, అసలు స్కీంలను గాలికొదిలేసింది. ఆ పార్టీని నమ్మితే నిండా మునుగుడే. మళ్లీ మోసపోవద్దు' అని ప్రజలకు పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సూచించారు. శనివారం పెగడపల్లి మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించి, ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, రెండు, మూడు పథకాలను మాత్రమే అరకొరగా అమలు చేస్తూ కాలయాపన చేస్తున్నదని దుయ్యబట్టారు. రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు సాయం, వరి పంటకు బోనస్, మహిళలకు ఆర్థిక సాయం, పెన్షన్ల పెంపు వంటి అనేక హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు ఓటు అడిగే హక్కు కోల్పోయారని, ఓట్లడిగేందుకు వస్తే ప్రజలు తరిమికొట్టే పరిస్థితి నెలకొన్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కరోనా సమయంలోనూ తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ రైతుబంధు, పెన్షన్లను నిరంతరాయంగా పంపిణీ చేశారని, సంక్షేమ పథకాలు ఎప్పుడూ ఆగలేదని తాగు, సాగు నీటికి కొరత లేకుండా బీఆర్ఎస్ పాలన కొనసాగిందన్నారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని, ప్రజల కోసం పోరాడే బీఆర్ఎస్‌కు ఓటేసి పెద్దపల్లి ఎంపీగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట పెగడపల్లి, నంచర్ల విండో చైర్మన్లు వోరుగంటి రమణారావు, మంత్రి వేణుగోపాల్, వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్, పార్టీ నాయకులు సురేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, వెంకన్న, రాజేశ్వర్‌రావు, కరుణాకర్‌రావు, ఆనందం, మోహన్‌రెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాసరావు, స్వామి, సంతోష్, రాజశేఖర్, లోకేశ్, ఆంజనేయులు, రహీం, తిరుపతి, లక్ష్మీనారాయణ, సత్యనారాయణరెడ్డి, రఘునందన్, షకీల్, సంజీవరెడ్డి, జానీ లక్ష్మణ్, శ్రీనివాస్, కరుణాకర్, మహేందర్, గంగాధర్, చెంద్రారెడ్డి, కనకయ్య, లక్ష్మణ్, భాస్కర్ ఉన్నారు

### వెంటనే కొనుగోళ్లు చేపట్టాలి

యాసంగి కోతలు ముమ్మరమైనయ్. అయినా గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు ఎందుకు ప్రారంభించడం లేదు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులతో రైతులు భయపడుతున్నరు. దిక్కుతోచని స్థితిలో దళారులకు క్వింటాల్ ₹1700 నుంచి ₹1800కే ధాన్యాన్ని విక్రయిస్తున్నరు. వెంటనే ప్రభుత్వం స్పందించాలి. రైతులకు నష్టం లేకుండా వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి. వరికి ₹500 బోనస్ ఇవ్వాలి.

**- పెగడపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం కొప్పుల ఈశ్వర్**



స్కిల్ అండ్ మెడికల్ సిములేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న చిన్నజీయర్ స్వామి, లక్ష్మీనర్సింహారావు తదితరులు

# అధునాతన వైద్యంపై అవగాహన పెంచుకోవాలి

- త్రిదండి చిన్న జీయర్ స్వామి
- బొమ్మకల్ చల్మెడ వైద్యవిజ్ఞాన సంస్థలో స్కిల్ అండ్ సిములేషన్ సెంటర్ ప్రారంభం

కరీంనగర్ రూరల్: ఏప్రిల్ 13: వైద్యరంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు, ఆధునాతన చికిత్స పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని వైద్యులకు త్రిదండి చిన్నజీయర్‌స్వామి సూచించారు. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థలో శనివారం స్కిల్ అండ్ మెడికల్ సిములేషన్ సెంటర్‌తోపాటు చిల్డ్రన్స్ కేర్, నియోనాటల్, గైనకాలజీ తదితర ల్యాబ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షల తీరును జీయర్ స్వామికి వైద్యులు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్య విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. చల్మెడ ఆనందరావు వైద్యశాలలో విద్యార్థులకు మెరుగైన బోధన అందించడం అభినందనీయమన్నారు. సమాజంలో మంచి వైద్యులుగా స్థిరపడాలంటే, వైద్య విద్యపై సంపూర్ణ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. నాణ్యమైన సేవలందించడం ద్వారానే పేషెంట్ల మన్ననలు లభిస్తాయన్నారు. కరోనా సమయంలో చల్మెడ దవాఖానలో అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లి భవిష్యత్‌లోనూ మెరుగైన వైద్యసేవలందించాలని అభిలషించారు. చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్ చల్మెడ లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ, స్కిల్ అండ్ మెడికల్ సిమ్యులేషన్ సెంటర్లు బెంగళూర్, పూణే లాంటి నగరాల్లో మాత్రమే ఉన్నాయని, ఇప్పుడు మన రాష్ట్రంలో తొలిసారిగా చల్మెడ ఆనందరావు వైద్యశాలలో ప్రారంభించుకున్నామని తెలిపారు. గతంలో కేన్సర్ వైద్యశాలను, ఇప్పుడు స్కిల్ అండ్ మెడికల్ సిములేషన్ సెంటర్‌ను చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా ప్రారంభించుకోవడం ఆనందంగా ఉన్నదన్నారు. మూడోసారి ఆయన వైద్యశాలకు రావడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. స్వామివారి ఆశీస్సులతో వైద్య రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకొని ప్రజలకు మెరుగైన వైద్యమందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థ డైరెక్టర్ డాక్టర్ వీ సూర్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ అసీమ్ అలీ, వైస్ ప్రిన్సిపాల్ టీ అనిత, వైద్యకళాశాల ప్రొఫెసర్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్రాల్లో ధాన్యం.. కండ్లల్లో దైన్యం

## ప్రారంభం సరే.. కొనుగోళ్లేవి?

- ముమ్మరమవుతున్న వరి కోతలు
- కొనుగోలు కేంద్రాలకు దిగుబడులు
- ముంచుకొస్తున్న అకాలవాన ముప్పు
- కొనుగోళ్లు లేక అన్నదాతల్లో ఆందోళన
- తేమ శాతం ఉన్నా కొనడం లేదని ఆవేదన
- తమకు ఆదేశాలు రాలేదంటూ దాటవేస్తున్న సెంటర్ నిర్వాహకులు
- అక్కడక్కడా జల్లులకు తడుస్తున్న వడ్లు
- తిరిగి ఆరబోసేందుకు నానా తంటాలు
- తమను గోస పెట్టవద్దని రైతుల వేడుకోలు

గంగాధర మండలం కురిక్యాలలో వర్షం ముప్పుతో ధాన్యంపై కప్పిన పరదాలు



**అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి నానా కష్టాలు పడాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది. ప్రతి గింజా కొంటామని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని ఇటు ప్రభుత్వం, అటు అధికారులు ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉన్నది. నేటికి ఉమ్మడి జిల్లాలో 90 శాతం కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభించలేదు. పలు చోట్ల కేంద్రాలు ప్రారంభమైనా.. నిర్వాహకులు కొనుగోలుపై దృష్టి సారించడం లేదు. అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు లేవంటూ.. మిల్లర్లు ముందుకు రావడం లేదంటూ.. దాటవేస్తుండడంతో రైతులు కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్నారు. మరోవైపు అకాల వర్షాలతో ఆందోళన చెందుతున్నారు. కేంద్రాలతోపాటు కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో సెంటర్ల వద్ద సౌకర్యాలు కల్పించి, తేమ శాతం ఉన్న వడ్లను యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని కోరుతున్నారు.**

### కిలో కూడా కొనలేదు

ఈ యాసంగి సీజన్‌లో గంగాధర మండలంలోని 33 గ్రామాల్లో రైతులు 18,900 ఎకరాల్లో వరి సాగు చేశారు. సాగునీరందక పోయినా అష్టకష్టాలు పడి పంటలను కాపాడుకున్నారు. పదిహేను రోజుల నుంచే కోతలు మొదలు పెట్టి.. వడ్లను కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. సహకార సంఘాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 33 గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. వీటిని ప్రారంభించి ఐదు రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎక్కడా కూడా కిలో ధాన్యాన్ని కొనలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఆకాశం మబ్బులు పట్టి ఉందని, వర్షం పడితే తమ కష్టం నీటిపాలవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరీంనగర్, ఏప్రిల్ 13 (నమస్తేతెలంగాణ ప్రతినిధి)/ గంగాధర : కేసీఆర్ పాలనలో నిరందీగా ఎవుసం చేసుకున్న రైతులు, కాంగ్రెస్ పాలనలో అరిగోస పడుతున్నారు. పోయినేడు యాసంగి మాదిరిగానే ఈ సారి కూడా సాగునీరు వస్తుందని ఆశించి సాగు చేసినా.. నీళ్లు రాక తండ్లాడుతున్నారు. చేతికొచ్చిన పంటలు కండ్ల ముందే ఎండిపోవడంతో కన్నీరు పెట్టుకున్నారు. కొందరైతే రోడ్డెక్కి ప్రభుత్వం తీరుపై నిరసనలు తెలిపారు. మరికొందరు చేసేదేమీ లేక పశువుల మేతకు వదిలేశారు. ఇంకొందరు ఆశ చావక పంటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేశారు. బావుల్లో పూటిక తీయించారు. కొత్త బోర్లు వేయించారు. ట్యాంకర్ల ద్వారా నీటిని పొలాలకు పారించారు. ఇలాంటి పరిస్థితుల్లో చేతికొచ్చిన దిగుబడులను అమ్ముకునేందుకు ఇప్పుడు మళ్లీ అష్టకష్టాలు పడుతున్నారు. ఇరువై రోజుల నుంచి కోతలు మొదలు కాగా.. అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకొని కొంత మంది రైతులు వారం ముందుగానే కోతలు కానిస్తున్నారు. ఇప్పటికే ఉధృతం చేశారు. వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్టే కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. అక్కడే మూడు నాలుగు రోజులు ఆరబోసి, ఇక కొంటారని ఎదురుచూస్తున్నారు. కొన్నిచోట్ల కోసిన ధాన్యాన్ని కల్లాల్లో ఎండబెట్టి విక్రయించేందుకు తెస్తే.. సెంటర్లు ఓపెన్‌కాక నిరాశ చెందుతున్నారు. వారం క్రితమే పలు చోట్ల ప్రజా ప్రతినిధులు కేంద్రాలను ఆర్భాటంగా ప్రారంభించినా.. కొనుగోళ్లు మొదలు కాక అక్కడే పడిగాపులు కాస్తున్నారు. నాలుగు రోజులుగా వాతావరణం మబ్బుపట్టి ఉండడం, శనివారం అక్కడక్కడా జల్లులు పడడం.. మరో మూడు నాలుగు రోజులు వర్షాలు కురిసే సూచనలు ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. ధాన్యం తడిసి, తమ రెక్కల కష్టం నీటిపాలవుతుందేమోనని భయపడుతున్నారు.



కురిక్యాలలో ధాన్యాన్ని నేర్పుతున్న రైతు శ్రీనివాస్

రేయింబవళ్లు అక్కడే ఉంటూ.. వాతావరణం కొంచెం తేడాగా ఉన్నా పరదాలు, కవర్లు కప్పుతున్నారు. కొన్నిచోట్ల పరదాలు ఇవ్వకపోవడంతో బయట కొనుకొచ్చుకొని కాపాడుకుంటున్నారు. ప్రభుత్వం తమను ఇంత గోస పెట్టవద్దని, వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని, ఎక్కడికక్కడ ముమ్మరం చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. గడిచిన పదేళ్లలో ఎన్నడూ ఇలాంటి సమస్య రాలేదని, ఊరికో సెంటర్ ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేపట్టారని గుర్తు చేస్తున్నారు. పంటల పెట్టుబడికి సకాలంలో రైతుబంధు ఇచ్చారని, యాసంగిలోనూ పుష్కలంగా నీరందించారని, పండించిన పంటను కల్లాల వద్దే కొన్నారని చెబుతున్నారు. ఇప్పుడు మాత్రం పరిస్థితి భిన్నంగా ఉన్నదని, తాము అరిగోస పడతున్నామని వాపోతున్నారు.

### కేంద్రాల్లో కొనేదెన్నడు?

యాసంగి సీజన్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,331 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని పౌరసరఫరాల శాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఈ నెల 8 నాటికే 1,183 కేంద్రాలు ప్రారంభించామని చెప్పారు. అయితే కేంద్రాలను ఆర్భాటంగా ప్రారంభించినా.. ఎక్కడా కొనుగోళ్లు మాత్రం చేయడం లేదు. దీంతో రైతులకు నిరాశ తప్పడం లేదు. కోతలు ముమ్మరం అవుతుండగా.. ధాన్యం ఒకేసారి కొనుగోలు కేంద్రాలకు వెల్లువెత్తనున్నది. ఈ క్రమంలో అధికారయంత్రాంగం అప్రమత్తమై.. లక్ష్యం మేరకు కేంద్రాలను ప్రారంభించి కొనుగోళ్లు చేయాల్సిన అవసరమున్నది. ఏమాత్రం నిర్లక్ష్యం జరిగినా రైతులు భారీగా నష్టపోయే ప్రమాదమున్నది. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తరలి వస్తున్నది. ఆరబోసిన ధాన్యాన్ని వెనువెంటే కొనకపోతే అకాల వర్షాలతో రైతన్న మునిగే ముప్పుంటుంది.

### ఒక్కో క్వింటాల్‌కు ₹400 దాకా నష్టం

ప్రస్తుతం ధాన్యం ఫైన్ రకం క్వింటాల్‌కు ₹2,203, సాధారణ రకానికి ₹2,183 మద్దతు ధర ఉంది. తాము అధికారంలోకి వస్తే క్వింటాల్‌కు ₹500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రకటనలు కూడా చేసింది. కానీ, ఇప్పట్లో ఇవ్వడం గగనమేనని తెలుస్తున్నది. పైగా కొనుగోళ్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో రైతులు ఆగమవుతున్నారు. ఓవైపు కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడం.. మరోవైపు అకాల వర్షాల ముప్పు పొంచి ఉండడంతో ఏం చేయాలో తెలియక ప్రైవేట్ వ్యాపారులు, రైస్ మిల్లర్లకు తెగనమ్ముకుంటున్నారు. క్వింటాల్‌కు ₹1800 చెల్లిస్తుండగా, ఒక్కో క్వింటాల్‌పై సుమారు ₹400 దాకా నష్టపోతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో అమ్ముకోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

### పరదాలు ఇత్తలేరు



నేను వడ్లు తెచ్చి ఐదు రోజులైంది. వానకు వడ్లు తడువకుండా కప్పడానికి పరదాలు ఇయ్యాలని అడిగితే లెవ్వంటున్నరు. పరదాలు లేక వానకు వడ్లు తడిసినయి. చేసేదేం లేక బయట దుకాన్ల పరదాలు కొనుకొచ్చుకున్నం. ధాన్యం మళ్ల తడిస్తే షానా ఇబ్బంది అయితది. సర్కారు పట్టించుకోవాలె. రైతులకు పరదాలు ఇయ్యాలె. జెప్పన వడ్లు కొనాలె. రైతులను ఇట్ల గోస పెట్టుడు మంచిదికాదు.

**- చింతల లక్ష్మి, రైతు (కురిక్యాల)**

### వానలు పడితే ఆగమే



నేను నిజామాబాద్ గ్రామ కొనుగోలు కేంద్రంలో వడ్లు పోసి ఇరువై రోజులైతాంది. అధికారులు ఆగమేగాల మీద పది రోజుల కింద సెంటర్‌ను ప్రారంభించిన్రు. ఇగా కాంటా చేస్తరనుకుంటే ఇటు వైపు వత్తలేరు. రోజు వడ్లు ఎండవోసుడు, మళ్ల కుప్పపోసుడే అయితాంది. ఎంతో కష్టపడి వడ్లు పండిస్తే అమ్ముకోవడం కష్టమమైతాంది. వానలు పడితే మా పరిస్థితి ఆగమైతది. అధికారులు తొందరగా వడ్లు కొనాలె.

**- బొల్లు గంగాధర్, రైతు (నిజామాబాద్)**

### కానరాని వసతులు

గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ ఎక్కడా సరిగ్గా వసతులు కల్పించలేదు. కూర్చునేందుకు ఎలాంటి సౌకర్యం లేదు. కనీసం తాగునీటి వసతిని ఏర్పాటు చేయలేదు. అంతేకాకుండా సెంటర్లలో కాంటా చేసేందుకు గన్నీ సంచులు లేవు. టార్పాలిన్లు కూడా అందుబాటులో లేవు.



కోనరావుపేట కొనుగోలు కేంద్రంలోని ధాన్యపు రాశులు

### వడ్లు తెచ్చి నాలుగు రోజులైంది



నాలుగు రోజుల కింద కురిక్యాల కేంద్రానికి వడ్లు తెచ్చిన. ఇప్పటి వరకు వడ్లు కొనలె. ఆకాశం మొఖాన చూస్తే మస్తు భయమైతంది. రోజూ జల్లులు పడుతున్నయి. వడ్లు తడువకుంట పరదాలు కప్పి కాపాడుకుంటున్నం. పెద్ద వాన పడితే వడ్లు నీళ్లల మునిగి చేతికి రాకుండ పోతయి. అధికారులు స్పందించాలి. వడ్లు కొని మా రైతులను ఆదుకోవాలి.

**- మడుపు రవీందర్‌రెడ్డి, రైతు (కురిక్యాల)**



కురిక్యాలలో చినుకులు పడుతుండడంతో ధాన్యంపై టార్పాలిన్ కవర్ కప్పుతున్న మహిళా రైతులు

### వడ్లకాన్నే కావాలి కాత్తున్నం



ఐదు రోజుల కింద కురిక్యాల కేంద్రానికి వడ్లు తెచ్చిన. నాలుగు రోజుల కిందనే కేంద్రాన్ని ప్రారంభించిన్రు. కానీ, ఇంకా కొనుడు చాల్ జెయ్యలె. అకాల వర్షాలు పడేటట్టు ఉన్నయి. అందుకే రాత్రింబవళ్లు వడ్లకాన్నే కావలి కాత్తున్నం. వాన పడకుంటే వడ్లు నేరిపి ఎండవెడుతున్నం. వానత్తె పరదాలు కప్పుతున్నం. వెంటనే వడ్లు కొని మా రైతులు నష్టపోకుండా చూడాలి.

**- జాగిరపు రవీందర్‌రెడ్డి, రైతు (కురిక్యాల)**





మాట్లాడుతున్న కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్, హాజరైన నాయకులు, కార్యకర్తలు

# మోసపూరిత హామీలు.. ఉద్దెరమాటలు

- కాంగ్రెస్ మభ్యపెట్టి అధికారంలోకి వచ్చింది
- వాగ్దానాలు నెరవేర్చకపోతే గుణపాఠం తప్పదు
- ఐదేళ్లలో ఎంపీగా బండి సంజయ్ పైసా పనిచేయలే
- కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్

చిగురుమామిడి, ఏప్రిల్ 13: 'కాంగ్రెస్‌వన్నీ ఉద్దెర మాటలు. మోసపూరిత హామీలు. ఆ పార్టీతో అయ్యేది లేదు. పోయేది లేదు. ప్రజలను మభ్యపెట్టి అబద్ధాల పునాదులపై గద్దెనెక్కింది. హామీలు అమలు చేయకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతరు' అని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ హెచ్చరించారు. హుస్నాబాద్‌లో శనివారం తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నేత గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ విద్యార్థి యువజన చైతన్య సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. పద్నాలుగేండ్లు కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో ప్రాజెక్టులను నిర్మించి కోటి ఎకరాలకు సాగు నీరందించామని చెప్పారు. పదేండ్లలో 1.61లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 30 వేల ఉద్యోగాలకు గత ప్రభుత్వం పరీక్షలు కూడా నిర్వహించిందని పేర్కొన్నారు. 2014లో తాను ఎంపీగా గెలిచిన తర్వాత కరీంనగర్‌లో ట్రిపుల్ ఐటీ మంజూరు చేయించి, 50 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయిస్తే ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ పట్టించుకోకపోవడంతో కేంద్రం ఇతర రాష్ట్రాలకు తరలించిందని మండిపడ్డారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఈ ఐదేండ్లలో బండి పైసా పనిచేయలేదని, ఒక్క గుడి, ఒక్క నవోదయ పాఠశాల తేలేదని దుయ్యబట్టారు. ఆయన ఏ అర్హతతో ప్రజలను ఓట్లు అడుగుతున్నారో చెప్పాలన్నారు. సంజయ్‌కి యువకులు, విద్యార్థులపై చిత్తశుద్ధి లేదని, అందుకే కేంద్రం నుంచి నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు తేలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో నలుగురు బీజేపీ ఎంపీలున్నా ఇంకా నవోదయ విద్యాలయాలు ఎందుకు తీసుకురాలేకపోయారని ప్రశ్నించారు. కేంద్రంలో 400 సీట్లు వస్తున్నాయని ప్రధాని మోడీ అంటున్నారని, అందులో బండి సంజయ్ లేకున్నా జరిగే నష్టమేమీ లేదన్నారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతు వినిపించాలంటే ప్రజలు కారు గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుడు బీ ప్రకాశ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రయోజనాలు దక్కాలన్నా, ప్రజా సమస్యలు పరిష్కారం కావాలన్నా రాబోయే ఎన్నికల్లో వినోద్ కుమార్‌ను గెలిపించుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ మాట్లాడుతూ, బండి సంజయ్ ఐదేళ్లు ఎంపీగా ఉన్నా.. ఐదు రూపాయలు తేలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వినోద్‌కుమార్ ఎంపీగా గెలిపించాలని



మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

# దొంగ హామీలతోనే అధికారం

నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

రాయికల్/ ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 13: దొంగ హామీలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ధ్వజమెత్తారు. కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాలకు న్యాయం జరిగిందని గుర్తు చేశారు. కానీ, నాలుగు నెలల రేవంత్ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని, రైతులు సాగునీరందక, కరెంట్ రాక చుక్కలు చూస్తున్నారని చెప్పారు. శనివారం జగిత్యాల ఇబ్రహీంపట్నం, రాయికల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశాలకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్‌కుమార్, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి పాల్గొన్నారు. అంతకుముందు ఇబ్రహీంపట్నంలో ముమ్మర ప్రచారం చేశారు. ఆరు గ్యారెంటీల పేరిట కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విలువలతో కూడిన రాజకీయం చేశారని, కానీ రేవంత్‌రెడ్డి కమర్షియల్ చేశారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఇప్పుడున్నది డూప్లికేట్ కాంగ్రెస్ అని..ఆ పార్టీ అభ్యర్థికి ఓటేస్తే ఒరిగేదేమీ ఉండదన్నారు. ఎంపీ అర్వింద్ హయాంలో నిజామాబాద్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి సున్నా అని, ఆయన మాటలు తప్పా చేసిందేమీలేదని ఆగ్రహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పాల్గొన్నారు.








కోరుట్ల: సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

# వడ్డీ వ్యాపారులపై పోలీసుల కొరడా

- కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో సోదాలు
- పెద్ద ఎత్తున ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు, ఖాళీ చెక్కులు స్వాధీనం

ధర్మపురి/ కోరుట్ల/ మెట్‌పల్లి/ ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 13 : అక్రమ వడ్డీ వ్యాపారులపై జగిత్యాల జిల్లా పోలీసులు కొరడా ఝులిపించారు. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు శనివారం కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో సోదాలు చేశారు. ధర్మపురి, కోరుట్ల, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లిలోని పలువురి ఇండ్లలో తనిఖీలు చేశారు. ధర్మపురిలో ₹6.23 లక్షల నగదుతో పాటు 65 ప్రామిసరీ నోట్లు, 23 బాండ్ కాగితాలు, కోరుట్లలో ₹1.28 లక్షల నగదు, ₹69 లక్షల విలువైన ప్రామిసరీ నోట్లు, రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే మెట్‌పల్లిలో మొత్తం ₹87లక్షల విలువైన 32 ప్రామిసరీ నోట్లు, 26 ఖాళీ చెక్కులు స్వాధీనం చేసుకోవడంతోపాటు ₹5లక్షల నగదును సీజ్ చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలో ₹38,14,370 విలువైన ప్రామిసరీ నోట్స్, నగదు సీజ్ చేసి కేసు నమోదు చేశారు.


